

## ఉన్న ఇల్లు కూల్చి.. అద్దె ఇంట్లో ఉంటూ..!

ఈమె పేరు కావాలి అనూష. నారాయణ పేట జిల్లా మక్తల్ మండలం గొల్లపల్లిలో ఉంటున్నది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో ఈమె పేరు వచ్చింది. దీంతో ఆమె తమ కుటుంబం తలదాచుకుంటున్న మట్టి ఇంటిని కూల్చింది. ఇక సొంత ఇల్లు కట్టుకోవచ్చన్న సంతోషంతో సమీపంలోని బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్నది. కూలి పనులు చేసుకుంటూ ఆ ఇంటికి అద్దె కడుతున్నది. అయితే, నాలుగు నెలలైనా గ్రామం వైపు అధికారులు రాకపోవడంతో ఆ కుటుంబానికి నిల్వ నీడ లేకుండాపోయింది. చేతిలో ఉన్న పైసలన్నీ ఇంటిని కూల్చడానికే ఖర్చు అయ్యాయని, బేస్ మెంట్ కడితేనే బిల్లు ఇస్తామని అధికారులు చెప్తుండటంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఆ కుటుంబం బాధపడుతున్నది.



## మంజూరు పత్రం ఇచ్చి పేరు లేదంటున్నారు

మాకు ఇల్లు లేదు. నా భర్త, పిల్లలతో కలిసి చిన్న గుడిసెలో బతుకుతున్నాం. మాకు ఎలాంటి భూమి లేదు. ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా, అధికారులు మంజూరుపత్రం ఇచ్చారు. బేస్‌మెంట్ వరకు పనులు చేయించాం. ఇప్పుడేమో లిస్టులో మీ పేరు లేదు, మీకు ఇందిరమ్మ ఇంటి పైసలు రావు, గతంలో మీ పేరు మీద ప్రభుత్వం నుంచి ఇల్లుకు పైసలు పొందినారు అని అధికారులు చెప్తున్నారు. కానీ, మేము ప్రభుత్వం నుంచి ఇంటి కోసం ఇప్పటివరకు పైసా బిల్లు పొందలేదు. ఇల్లు, భూమి లేని మాకు ప్రభుత్వం ఇండ్లు ఇచ్చి ఆదుకోవాలి.

– కాట్రాల కిష్టమ్మ, ధర్మారం, మెదక్ జిల్లా

# ఇల్లు పాయె.. బిల్లు రాకపాయె

**నమ్మి కూల్చేస్తే.. నట్టేట ముంచారు!** | **రిపబ్లిక్ డే సాక్షిగా పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలిచ్చిన సర్కారు** | **ముందు పాత ఇల్లు కూల్చేసి చదును చేస్తే ముగ్గు పోస్తామని అధికారుల హడావుడి** | **తీరా ఇల్లు కూల్చాక జాబితాలో పేర్లు మాయం** | **పాతది కూల్చుకుని, కొత్తది కట్టుకునే దారిలేక లబోదిబోమంటున్న లబ్ధిదారులు**

- ఇదెక్కడి అన్యాయం అంటూ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- తామేం చేయలేమని చేతులెత్తేసిన అధికారులు
- జాబితాలో పేర్లు ఉండి, నిబంధనల ప్రకారం ఇండ్ల నిర్మాణం చేపట్టినవారికీ విడుదల కాని పైసలు
- సర్కారీ నిర్లక్ష్యంతో అప్పుల పాలవుతున్న ఇందిరమ్మ లబ్ధిదారులు

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్ వర్క్, మే 15: 'కొండనాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయినట్టు'గా తయారైంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పరిస్థితి! 'మీకు ఇల్లు మంజూరైంది. వీలైనంత తొందరగా పాత ఇంటిని కూల్చండి. మేము వచ్చి ముగ్గు పోస్తాం' అంటూ అధికారులు హడావుడి చేశారు. గత జనవరి 26న రిపబ్లిక్ డే సాక్షిగా పైలట్ గ్రామాల్లో గ్రామసభలు పెట్టి మరీ, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైందన్న సంతోషంతో అధికారులు చెప్పినట్టుగానే ఆయా లబ్ధిదారులు ప్రస్తుతం తాము ఉంటున్న చిన్నపాటి గుడిసెలను, పాత రేకుల ఇండ్లను కూల్చేసుకున్నారు. తట్టాబుట్టా సర్దుకొని అద్దె ఇండ్లలోకి, బంధువుల ఇండ్లలోకి, కొన్నిచోట్ల పశువుల పాకల్లోకి మారారు. మరికొందరు కొత్త ఇంటి నిర్మాణం కోసం అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. కానీ, రోజులు గడిచినా అధికారులు రాలేదు. ముగ్గులు పోయలేదు. చివరకు 'మీ పేరు జాబితాలో లేదు' అని ఒకరికి, 'తాజా జాబితాలో మీ పేరు రాలేదు. మొదటి జాబితా ఇండ్ల నిర్మాణం పూర్తయ్యాక మీ ఇంటికి ముగ్గు పోస్తాం' అంటూ మరొకరికి, 'మీ పేరు మూడో జాబితాలో ఉన్నది. దాని నిర్మాణం ఇప్పట్లో కాదు' అంటూ ఇంకొకరికి సమాధానాలు చెప్పారు అధికారులు. దీంతో తమకంటూ ఒక సొంత గూడు కట్టుకోవచ్చునని ఆశ పడ్డ లబ్ధిదారులకు ఆవేదనే మిగిలింది. 'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఉన్న ఇల్లు కూల్చుకుంటే.. చివరికి నట్టేట ముంచింది..' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక అనేక వడపోతల అనంతరం అధికారులు వచ్చి ముగ్గు పోసిన తరువాత ఇంటి నిర్మాణం ప్రారంభించిన వారిది మరో వ్యథ. బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేస్తే రూ.లక్ష, పిల్లర్లు దశ పూర్తయితే మరో రూ.లక్ష... ఇలా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పిన సర్కారు.. ఇప్పటికీ నయా పైసా ఇవ్వలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చి ఇంటి నిర్మాణం మొదలు పెట్టామని, కానీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వడ్డీల భారం పెరుగుతున్నదని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. సొంతింటి కల నెరవేరడం సంగతేమోకానీ, ప్రభుత్వ నిర్లక్ష్యంతో అప్పులపాలు కావాల్సి వస్తున్నదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా బిల్లులు సకాలంలో మంజూరు చేసి, తమను అప్పులపాలు కాకుండా కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రతి గ్రామంలోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. చివరకు ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనూ ఇలాంటి దృశ్యాలే సాక్షాత్కరిస్తున్నాయి. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గొల్లపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద అధికారులు ఎంపిక చేశారు. ఈ చిన్న గ్రామంలో నిరుపేదలను గుర్తించి 11 ఇండ్లను మంజూరు చేశారు. ఈ ఇండ్లకు మార్కింగ్ కూడా ఇచ్చారు. ప్రభుత్వం ఇల్లు ఇస్తుందన్న ఆశతో లబ్ధిదారులు తాము నివాసం ఉంటున్న చిన్నచిన్న గుడిసెలు, మట్టి మిద్దెలను కూల్చేసుకున్నారు. దాదాపు మూన్నెళ్లు అవుతున్నా ఇంతవరకు అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో వారంతా పరేషాన్‌లో పడ్డారు.



మహబూబాబాద్ జిల్లాలోని పైలట్ గ్రామం నామాలపాడులో మంజూరు పత్రాలను చూపుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు

## పత్రాలు అందరికీ.. ఇండ్లు కొందరికే..!

- పైలట్ గ్రామంలో లబ్ధిదారుల పరేషాన్
- 114 మందికి ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు
- చివరకు 26 మంది పేర్లతోనే జాబితా



బయ్యారం, మే 15: ఇందిరమ్మ ఇండ్ల కోసం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం నామాలపాడు గ్రామ పంచాయతీని పైలట్ గ్రామంగా అధికారులు ఎంపిక చేశారు. జనవరి 26న ఎమ్మెల్యే కోరం కనకయ్య ధర్మపురం గ్రామంలో 40 మందికి, రాయికుంటలో 32 మందికి, నామాలపాడులో 42 మందికి చొప్పున మొత్తం 114 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపత్రాలు అందజేశారు. ఇచ్చిన పది రోజులకే గ్రామ పంచాయతీ సిబ్బంది ఆయా లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి, సంతకాలు పెట్టించి మళ్లీ ఇస్తామంటూ వాటిని వెనక్కి తీసుకున్నారు. కొందరు పత్రాలు వెనక్కి ఇవ్వగా, మరికొందరు ఇచ్చేందుకు నిరాకరించారు. గ్రామంలో మళ్లీ సర్వే చేసిన అధికారులు నామాలపాడులో ఇద్దరికి, రాయికుంటలో ఐదుగురికి, ధర్మపురంలో 19 మందికి మాత్రమే ఇండ్లు మంజూరయ్యాయని చెప్పి, ముగ్గు పోశారు. తొలుత మంజూరు పత్రాలు అందుకున్నవారిలో కొందరు ఇల్లు మంజూరైందన్న సంతోషంతో ఉన్న ఇంటిని కూలగొట్టుకున్నారు. మరికొందరు నిర్మాణ సామగ్రి కొనుగోలు చేశారు. ఇల్లు వచ్చిందని ఆశపడితే నిరాశే ఎదురైందని, పత్రాలు ఇచ్చిన ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో విజయలక్ష్మిని వివరణ కోరగా.. 26 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, మరో 24 మందికి త్వరలో మంజూరవుతాయని తెలిపారు.

## అన్నం పెట్టి.. కంచం గుంజుకున్నారు



ఇందిరమ్మ ఇల్లు మంజూరైందంటూ తొలుత మంజూరు పత్రం ఇచ్చారు. దీంతో ఇల్లు కట్టుకుంటున్నామని అందరికీ చెప్పుకున్నాం. తీరా ఇప్పుడేమో ఆ పత్రాన్ని వెనక్కి తీసుకొని మీకు ఇంకా ఇల్లు మంజూరు కాలేదని చెప్తున్నారు. ఇప్పుడు మేము ఏంచేయాలి? పేదోళ్లకు ఇల్లు ఎందుకు మంజూరు చెయ్యరు? కంచంలో అన్నం పెట్టి గుంజుకున్నరు.

- జీ సుగుణ, నామాలపాడు, మహబూబాబాద్ జిల్లా

## పాత ఇల్లు తీసేసి కొత్త ఇంటికి సిద్ధమయ్యాం



ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని అధికారులు మంజూరుపత్రం ఇచ్చారు. దీంతో పాత ఇంటిని తీసేసి అక్కడే కొత్త ఇల్లు కట్టుకుందామనుకున్నాం. పాత ఇంటి పెంకులు తొలగించాం. ఇంతలో ఇల్లు మంజూరు కాలేదని అధికారులు చెప్పడంతో సగం తీసి ఆపేశాం. ప్రస్తుతం అత్తింట్లో ఉంటున్నాం. ఇల్లు వచ్చిందని ఎంతో సంతోష పడ్డాం. తీరా, రాలేదని చెప్పడంతో నిరాశ చెందాం. మంజూరుపత్రం ఇచ్చి ప్రభుత్వం మోసం చేసింది.

- జీ మహేశ్వరి, నామాలపాడు, మహబూబాబాద్ జిల్లా

## దేశరాజ్‌పల్లిలో లబ్ధిదారుల కుదింపు!

కమలాపూర్, మే15: ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించడంతో లబ్ధిదారుల ఎంపికలో అధికారులు వడపోత మొదలెట్టారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం 24 దేశరాజ్‌పల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గ్రామంలో మొదట 383 ఇండ్లు మంజూరైనట్టు గ్రామసభలో అధికారులు ప్రకటించారు. ఆ తరువాత 208 మంది లబ్ధిదారులను మాత్రమే అర్హులుగా ప్రకటించారు. అందులోనూ యాప్‌లో 150 ఇండ్లు మాత్రమే కనబడుతున్నాయి. ఇందులో 41 ఇండ్లకు గ్రౌండింగ్ కావడంతో లబ్ధిదారులు సొంత డబ్బులతో పనులు ప్రారంభించారు. లబ్ధిదారుల ఎంపిక జాబితాను కుదించడంతో ఎంపికైన లబ్ధిదారులు సైతం తమకు బిల్లులు వస్తాయో లేదో అనే సందేహంలో కొట్టుమిట్టాడుతున్నారు. 400 చదరపు అడుగుల భూమి ఉండి, రేషన్‌కార్డు, గూనపెంకుటిల్లు, రేకులషెడ్డు, గుడిసెలో నివాసం ఉండేవారిని మాత్రమే అర్హులుగా ఎంపిక చేశారు. నాలుగు చక్రాల వాహనం, ఐదు ఎకరాల కంటే ఎక్కువ వ్యవసాయ భూమి ఉన్న వ్యక్తులను అనర్హులుగా ప్రకటించాలనే ఆదేశాలున్నాయని అధికారులు చెప్తున్నారు.

## సర్కారు నిబంధన లబ్ధిదారులకు శాపం

ఎల్లారెడ్డిపేట, మే 15 : ప్రభుత్వ నిబంధనలు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు శాపంగా మారుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేశారు. అయితే, ఇందిరమ్మ ఇండ్లు 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్యలో ఉండాలని నిబంధన పెట్టడంతో లబ్ధిదారులు ఇబ్బందిపడుతున్నారు. తొలుత నచ్చిన కొలతల్లో కట్టుకోండి సర్కారు మాత్రం రూ.4 లక్షలు ఇస్తుందని అధికారులు చెప్పారని, తీరా బేస్‌మెంట్ పిల్లర్లు అయిన తర్వాత 600 చదరపు అడుగుల కంటే ఎక్కువ ఉంటే బిల్లులు రావని చెప్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గుండారానికి చెందిన పండుగు సత్తవ్వ భర్త విజయ్ 25 ఏండ్ల క్రితమే మృతి చెందాడు. చిన్న గుడిసెలో నివాసం ఉంటున్న ఆమెకు ఇల్లు మంజూరైంది. దీంతో బేస్‌మెంట్ పూర్తి చేసి పిల్లర్లు కూడా పోయించింది. తీరా అధికారులు బేస్‌మెంట్ కొలతలు చూసి 600 చదరపు అడుగులు దాటిందని, బిల్లు రాదని చెప్పడంతో ఆందోళన చెందుతున్నది. ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బుకు కొంత అప్పు చేసి ఇల్లును పూర్తి చేసుకుంటామని, ఇప్పటికిప్పుడు దాన్ని తగ్గించమంటే ఎలా? అని ఆవేదన వ్యక్తంచేస్తున్నది. దీనిపై హౌసింగ్ ఏఈ హకీంను వివరణ కోరగా మొదట ఇందిరమ్మ ఇల్లు చుట్టు కొలత 400 చదరపు అడుగులుగా ఉంటే దాన్ని మార్చి 600 చదరపు అడుగులకు పెంచారని, ఇల్లు కట్టుకునే వారు నిబంధనల ప్రకారం నిర్మించాలని సూచించారు.

# దరఖాస్తులు 82 లక్షలు.. అర్హులు 18 లక్షలే!

- తొలుత 4.5 లక్షల మందికే లబ్ధి
- మొత్తం వడపోతలు, తీసివేతలే
- ఇందిరమ్మ ఇండ్లకూ మంగళం
- తూతూ మంత్రంగా అమలు
- నిబంధనల పేరుతో మొండిచేయి

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ, కల్యాణలక్ష్మి తదితర పథకాల మాదిరిగానే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సైతం అరకొరగా అమలుచేసి మమ అనిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 82 లక్షల దరఖాస్తులను వడపోసి తొలి విడత అర్హుల జాబితాలో 18 లక్షల మంది దరఖాస్తుదారులను మాత్రమే చేర్చడం ఇందుకు నిదర్శనం. అందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రగల్భాలు పలికిన సర్కారు.. పథకం అమలు విషయానికి వచ్చేసరికి రకరకాల నిబంధనలతో చాలామంది దరఖాస్తుదారులను అనర్హుల జాబితాలో చేర్చి చేతులు దులుపుకుంటున్నది. అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం రేషన్ కార్డులు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను కాకుండా ఆధార్, పాన్ కార్డులను, బ్యాంకు ఖాతాల లావాదేవీలను పరిగణనలోకి తీసుకొని వాటిని అన్ని కోణాల్లో విశ్లేషించింది. దరఖాస్తుదారులు చెల్లిస్తున్న ఇంటి అద్దెలు, కారు లోన్లు, ఇతరత్రా గృహోపకరణాల లోన్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. కార్లు, ద్విచక్ర వాహనాలు ఉన్నవారిని ఇండ్లకు అనర్హులుగా తేల్చింది.

### అప్పులనే ఆస్తులుగా పరిగణించి

ప్రస్తుత పరిస్థితుల్లో బ్యాంకులు బతిమిలాడి మరీ క్రెడిట్ కార్డులు అంటగడుతున్నాయి. ఏ వస్తువు కొందామన్నా వాయిదాల పద్ధతిలో దొరుకుతున్నాయి. సొంతిల్లు, ఇంటి జాగా లేనివారు సైతం అప్పుచేసి అనేకరకాల గృహోపకరణాలను కొనుక్కుంటున్నారు. వారిలో చాలామంది ఆ అప్పులను తీర్చడంలో విఫలమవుతున్నారు. ఆధార్, పాన్ కార్డులు, బ్యాంకు ఖాతాలన్నీ అనుసంధానమై ఉండడంతో ఆస్తులేమీ లేకున్నప్పటికీ బ్యాంకు లావాదేవీలను బట్టి ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉన్నట్టు అధికారులు గుర్తిస్తున్నారు.

### దరఖాస్తుల ఏరివేతే లక్ష్యంగా..

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కోడిగుడ్డుపై ఈకలు పీకిన చందంగా ఖరీదైన ద్విచక్ర వాహనం ఉన్నవారిని కూడా అనర్హులుగా ప్రకటించడమే ఇందుకు నిదర్శనం. ప్రైవేటు జాబ్ చేస్తున్నవారిని కూడా అనర్హులుగా తేల్చడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



పూరి గుడిసె ఉన్నా, ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రం వెనక్కి తీసుకున్న లబ్ధిదారుడు

### ఇండ్ల పథకం వివరాలు

- ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులు 82,82,332
- పరిశీలన తరువాత మిగిలిన దరఖాస్తులు 77.18 లక్షలు
- జాగా ఉండి ఇల్లు లేనివారు, కచ్చా ఇల్లు ఉన్నవారు (ఎల్–1) 18.67 లక్షల మంది
- జాగా, ఇల్లు రెండూ లేకుండా అద్దె ఇంట్లో ఉన్నవారు (ఎల్–2) 17.36 లక్షల మంది
- బ్యాంకు ఖాతాల ఆధారంగా సంపన్నులుగా తేలినవారు (ఎల్–3) 41.15 లక్షల మంది
- తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు 4.5 లక్షలు
- ఇప్పటివరకు మంజూరు చేసినవి 72,045
- ఒక్కో ఇంటికి ప్రభుత్వం ఇచ్చేది రూ.5 లక్షలు
- పథకాన్ని ప్రారంభించిన తేదీ 2024 మార్చి 11
- ఇప్పటివరకు నిర్మించిన ఇండ్లు 0

### వీరంతా అనర్హులే

- రూ.50 వేలు లేదా అంతకంటే ఎక్కువ పరిమితితో కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్నవారు
- ప్రభుత్వ ఉద్యోగులు, వ్యవసాయేతర వాణిజ్యం నిర్వహించేవారు
- నెలవారీగా రూ.15 వేలు లేదా అంతకంటే ఎక్కువ వేతనం పొందుతున్నవారు, ఆదాయపు పన్ను చెల్లించేవారు
- రిఫ్రిజిరేటర్, ల్యాండ్‌లైన్ ఫోను, 2.5 ఎకరాల కన్నా ఎక్కువ సాగుభూమి ఉన్నవారు

### అర్హులెవరంటే..

- భూమి లేని, ఇల్లు లేని కుటుంబాలు
- ఒకటి, లేక రెండు గదులున్న కచ్చా ఇల్లు ఉన్నవారు. ఇంటి పైకప్పు కాంక్రీట్‌తో లేనివారు
- పర్మినెంట్ ఉద్యోగం లేనివారు. రోజువారీ కూలీలు
- షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వికలాంగులకు ప్రాధాన్యం

### దరఖాస్తుకు ధ్రువపత్రాలు

- ఆధార్ నంబర్‌తోపాటు సెల్ఫ్ అటెస్టెడ్ ఆధార్ కార్డు. ఒకవేళ దరఖాస్తుదారులు నిరక్షరాస్యులైతే వేలిముద్రతో కూడిన కన్సెంట్ లెటర్ తప్పనిసరి
- మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) జాబ్ కార్డు
- బ్యాంకు ఖాతా వివరాలు (ఒరిజినల్, డూప్లికేట్)
- స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) నంబర్ (మరుగుదొడ్డి కోసం నమోదు చేసుకున్న వివరాలు)

## రామేశ్వరంబండలో యాప్ గండం!

### కలెక్టర్ విజిట్ చేసిన రూపాయి రాలేదు

పటాన్‌చెరు రూరల్, మే 15: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం అన్ని వడపోతల తరువాత 67 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారిలో 13 మంది ప్రస్తుతం ఇంటి పనులు ప్రారంభించారు.

- నిబంధనల ప్రకారం.. బేస్ మెంట్ లెవల్ పూర్తి చేసినవారికి రూ.1లక్ష అందజేయాలి. నిబంధనల మేరకు పిల్లర్లు పూర్తి చేసుకుంటే మరో రూ.లక్ష చెల్లించాలి. కానీ, ఇప్పటివరకూ బిల్లు మంజూరు కాలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.
- మార్చి 15న జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి రామేశ్వరంబండ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఆకస్మికంగా వచ్చి పరిశీలించారు. లబ్ధిదారులు కడుతున్న ఇండ్లను చూసి సంతృప్తి వ్యక్తం చేస్తూ, పునాది దశకు చేరిన లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని, సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు. కానీ, ప్రస్తుతం పునాది దశ పూర్తి చేసుకుని, స్లాబ్‌లు వేయడానికి సిద్ధమవుతున్నవారికి సైతం ఇంతవరకు రూపాయి ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో అప్పులు చేసి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించిన లబ్ధిదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల గ్రామంలో ముగ్గురికి మాత్రమే మొదటి విడత బిల్లులు చెల్లించారు. మరికొందరి పేర్లను యాప్ స్వీకరించడం లేదు. ఇది టెక్నికల్ సమస్య అని అధికారులు చెప్తుండగా, తమ బిల్లులే ఎందుకు రావడం లేదని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.



### యాప్ సమస్యలతోనే బిల్లులు పెండింగ్

యాప్‌లో అప్‌లోడ్ సమస్య ఏర్పడటంతో కొందరి పేర్లు నమోదు కావడం లేదు. రామేశ్వరంబండ గ్రామంలో గ్రామ కార్యదర్శి ముగ్గు వేసిన దశ నుంచీ పర్యవేక్షిస్తున్నారు. మన్నె మల్లేశ్‌కు సంబంధించిన ఇంటి నిర్మాణం బిల్లు యాప్ స్వీకరించక ఆగింది. హౌజింగ్ విభాగం ఏఈ, డీఈలకు సమస్యను వివరించాం. టెక్నికల్ టీం ఈ సమస్యను పరిష్కరిస్తే తక్షణమే బిల్లులు చెల్లిస్తాం. గ్రామంలో ముగ్గురు లబ్ధిదారులకు ఈ మధ్యే బిల్లులు చెల్లించాం.

- యాదగిరి, ఎంపీడీవో, పటాన్‌చెరు